క్లుప్తంగా

డబుల్‌బెడ్‌రూంల ఇళ్లలో వసతుల కల్పనకు కృషి



అభివృద్ధి పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

జగిత్యాల: డబుల్‌బెడ్‌రూంల ఇళ్ల వద్ద మరిన్ని వసతుల కల్పనకు కృషి చేస్తానని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అన్నారు. శనివారం డబుల్ బెడ్‌రూం ఇళ్ల సమీపంలో రూ.10 లక్షలతో నిర్మిస్తున్న రోడ్డును ప్రారంభించి మాట్లాడారు. ప్రతి వీధిలో సీసీరోడ్ల నిర్మాణాలు ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఆయన వెంట మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ జ్యోతి, గిరి నాగభూషణం, శ్రీనివాస్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకం



రిటైర్డ్ టీచర్లను సన్మానిస్తున్న నాయకులు

కోరుట్ల: సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమని ఎంఐఎం పట్టణ అధ్యక్షుడు ఎంఏ రఫీ అన్నారు. పట్టణంలోని ఓ గార్డెన్స్‌లో ఆల్ ఇండియా ఐడియల్ టీచర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం విశ్రాంత ఉపాధ్యాయులు అబ్దుల్ రహీం, మహమ్మద్ రఫీలను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా తో సత్కరించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకుడు జువ్వాడి కృష్ణారావు, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు గంగాధర్, ఐటా అధ్యక్షుడు మహమ్మద్ ఫసియొద్దీన్, కార్యదర్శి ఎంఏ అజీం, ఎండీ యూసుఫ్, తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న సరిహద్దు వివాదం



ఆందోళన చేస్తున్న నూకపల్లి గ్రామస్తులు

మల్యాల: మండలంలోని రామన్నపేట, నూకపల్లి గ్రామాల సరిహద్దు వివాదం కొనసాగుతూనే ఉంది. జాతీయ రహదారి సమీపంలో నూతనంగా నిర్మించిన ఫంక్షన్ హాల్ బోర్డుపై రామన్నపేట గ్రామం పేరు రాయడంతో నూకపల్లి గ్రామ ప్రజలు ఆందోళన చేశారు. శనివారం కొంతమంది గ్రామస్తులు ఫంక్షన్ హాల్ వద్దకు వెళ్లి, బోర్డు తొలగించాలని డిమాండ్ చేయడంతో, సదరు యజమాని బోర్డులో పేరుపై స్టిక్కర్ అతికించి, రెండు గ్రామాల ప్రజల అంగీకారంతోనే బోర్డు ఏర్పాటు చేస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

సబ్‌సెంటర్ నిర్మించాలని వినతి



వినతిపత్రం అందజేస్తున్న రైతులు

రాయికల్: మండలంలోని మూటపల్లిలో శిథిలావస్థలో ఉన్న పశుసంవర్ధక శాఖ సబ్‌సెంటర్‌కు నూతన భవనం నిర్మించాలని కోరుతూ శనివారం గ్రామ రైతు సంఘం నాయకులు మాజీమంత్రి జీవన్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. నూతన సబ్‌సెంటర్ నిర్మాణానికి నిధులు మంజూరు చేసేలా కృషి చేస్తానని జీవన్‌రెడ్డి హామీ ఇచ్చారు.

నేలకొరిగిన భారీ వృక్షం



ఆస్పత్రిలో ఆవరణలో పడిపోయిన భారీ వృక్షం

రాయికల్: పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో ఉన్న భారీ వృక్షం శనివారం నేలకొరిగింది. ఆస్పత్రి వెనుకభాగంలో ఉన్న ఫీంసింగ్ రేకుల షెడ్డుపై ఒక్కసారిగా పడిపోవడంతో అనార్కలీ అనే మహిళకు గాయాలయ్యాయి. ఈ షెడ్డులో ఐదుగురు నివాసం ఉంటుండగా ఆ సమయంలో అనార్కలీ మాత్రమే ఉండటంతో గమనించి బయటకు వచ్చింది. దీంతో తృటిలో పెను ప్రమాదం తప్పింది. నిరుపేద కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.



కోరుట్ల బస్టాండ్‌లో ప్రయాణికుల రద్దీ



సారంగాపూర్‌లో చిన్నారుల సంబరాలు



రాయికల్: కుటుంబ సభ్యులతో రాఖీ సంబరాలు

ఘనంగా రాఖీ వేడుకలు

జగిత్యాల జోన్/జగిత్యాలరూరల్/కోరుట్లరూరల్/రాయికల్/పెగడపల్లి/మల్లాపూర్/సారంగాపూర్: రాఖీ పౌర్ణమి వేడుకలు శనివారం ఘనంగా జరుపుకున్నారు. అన్నా, తమ్ముళ్లకు అక్కా చెల్లెళ్లు రాఖీలు కట్టి శుభాకాంక్షలు తెలిపారు. ఆడపడుచులు తరలి వచ్చి అన్నదమ్ములకు రాఖీ కట్టారు. జిల్లా కేంద్రంలోని మినిస్టేడియంలో వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం రక్షాబంధన్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. రాఖీ సందర్భంగా బస్టాండ్‌లు కిటకిటలాడాయి.



రాఖీ వేడుకల్లో పాల్గొన్న జగిత్యాల వాకర్స్ అసోసియేషన్ సభ్యులు



మల్లాపూర్: రాఖీ వేడుకల్లో పాల్గొన్న అన్నాచెల్లెళ్లు

దేవాలయానికి అడ్డంగా దుకాణాలు



ఆలయం వద్ద ఆందోళన చేస్తున్న భక్తులు, అర్చకులు

జగిత్యాల: జిల్లా కేంద్రంలోని నడిబొడ్డున టవర్ సర్కిల్ మార్కెట్‌లోని భవాని శంకర శ్రీనివాస ఆంజనేయస్వామి ఆలయానికి అడ్డంగా షెడ్లు వేసుకుని కూరగాయల దుకాణాలు నిర్వహిస్తూ భక్తులకు ఇబ్బందులు కలిగిస్తున్నారని శనివారం భక్తులు, అర్చకులు ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మార్కెట్‌లో అతి పురాతనమైన వేంకటేశ్వరస్వామి ఆలయానికి ప్రతిరోజు వందలాది మంది భక్తులు వచ్చి మొక్కులు చెల్లించుకుంటారని, కోరిన కోర్కెలు తీరుతాయని నిత్యం భక్తులు వచ్చి 101 ప్రదక్షిణలు చేస్తుంటారని, పండగల సందర్భంలో ఆలయం మొత్తం భక్తులతో నిండిపోతుందన్నారు. ఈ సమయంలోనే ఈ ఆలయాన్ని ఆనుకుని ప్రవేశ ద్వారానికి ఆనుకుని అక్రమంగా షెడ్లు వేసుకుని కూరగాయల వ్యాపారం నిర్వహిస్తూ భక్తులకు ఇబ్బందులు కలిగిస్తున్నారన్నారు. షెడ్లను పక్కకు జరిపించాలని గత కొంత కాలంగా మున్సిపల్ అధికారులకు విన్నవించినా ఫలితం లేదన్నారు. శనివారం ఆలయానికి వచ్చిన భక్తులు, ధర్మకర్తల మండలి సభ్యులు, వివిధ హిందూ సంఘాల సభ్యులు రోడ్డుపైకి వచ్చి బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. అనంతరం మున్సిపల్ కమిషనర్‌కు, ఆలయ ఈవోకు వినతిపత్రం అందజేశారు. రెండు రోజుల్లో ఆలయం ముందున్న షెడ్లు తొలగిస్తామని మున్సిపల్ అధికారులు హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

దేశంలో పుట్టిన ప్రతీ పౌరుడు హిందువే

మల్లాపూర్: భారత దేశంలో పుట్టిన ప్రతీ పౌరుడు హిందువుడే అని రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ ప్రాంత సహవ్యవస్థ ప్రముక్ తిరుమల్‌జీ అన్నారు. శనివారం మల్లాపూర్ మండల కేంద్రంలోని శ్రీ సరస్వతి హైస్కూల్‌లో నిర్వహించిన ఆర్‌ఎస్‌ఎస్ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. దేశంలోని పౌరులందరు సమానమేనని, ప్రజలందరు ఒక కుటుంబంగా భారతమాత బిడ్డలేనన్నారు. ధర్మ పరిరక్షణకు ప్రతి భారతీయుడు నడుంబిగించి కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్‌ఎస్‌ఎస్ జిల్లా కార్యవహ్ మహేందర్, మండల బాధ్యులు ఎగ్యారపు వెంకటేశ్వర్లు, తోట రవీందర్, సాంబారి శంకర్, లవంగ శివకుమార్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న తిరుమల్‌జీ

ఘనంగా ఆదివాసీ దినోత్సవం





జగన్నాథపూర్, చిట్టాపూర్‌లో కొమురం భీం విగ్రహానికి నివాళి అర్పించిన ఆదివాసీ నాయకులు

రాయికల్: మండలంలోని జగన్నాథపూర్, ఇటిక్యాల గ్రామాల్లో శనివారం ఆదివాసీ దినోత్సవం సందర్భంగా జగన్నాథపూర్ గ్రామంలో కొమురభీం విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో జగన్నాథపూర్‌లో సిడెం భీంరావు, అత్రం విజయ, పెందూరి మారుతి, సుధాకర్, ఇటిక్యాలలో గోపీ ప్రసాద్, రాజేందర్, నరేశ్, ముత్తన్న, ధనుంజయ్, సత్తన్న పాల్గొన్నారు.

మల్లాపూర్: ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివాసి నాయకపోడు సంఘం ఆధ్వర్యంలో మండలంలోని చిట్టాపూర్‌లో కొమురం భీం విగ్రహం వద్ద శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆదివాసీ నాయకపోడు సంఘం జిల్లా అధ్యక్షుడు మట్ట సంజీవ్ మాట్లాడుతూ ఆదివాసుల హక్కుల పరిరక్షణకు పోరాడిన మహనీయులందరికీ నివాళి అర్పించారు. ఆదివాసులను బలోపేతం చేసేందుకు ఎస్టీ రిజర్వేషన్లు పెంచి ప్రత్యేక సంక్షేమ పథకాలను అమలు చేయాలని ప్రభుత్వానికి విన్నవించారు. కార్యక్రమంలో ఆదివాసీ నాయకపోడు గ్రామ అధ్యక్షుడు బిచ్చల అనిల్, కుల పెద్దలు, ఆదివాసీలు, కులస్తులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



జగిత్యాల శ్రీరామ మందిరంలో ఉపాకర్మ వేడుకల్లో పాల్గొన్న వేద పండితులు

శ్రీరామమందిరంలో ఉపాకర్మ

జగిత్యాల: జిల్లా కేంద్రంలోని బ్రాహ్మణ వీధిలోని శ్రీరామ మందిరంలో శ్రావణ పౌర్ణమిని పురస్కరించుకుని వేద పండితులు ఉపాకర్మ నిర్వహించారు. ఈ సందర్భంగా ఋషుల హోమం, వైదిక క్రతులు, ఋషి తర్పణం నిర్వహించారు. కార్యక్రమంలో సాంబయ్యశర్మ, తిగుళ్ల సూర్యనారాయణశర్మ, విషుశర్మ పాల్గొన్నారు.

అనారోగ్యంతో కారోబార్ మృతి

కోరుట్ల రూరల్: మండలంలోని సర్పరాజీపూర్ గ్రామపంచాయతీ కారోబార్ ఆడెపు గణేష్ (47) అనారోగ్యంతో శనివారం మృతి చెందాడు. పైడిమడుగు గ్రామానికి చెందిన ఆడెపు గణేశ్ 30 ఏళ్లుగా కారోబార్‌గా పని చేస్తున్నాడు. గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. శుక్రవారం ఆరోగ్యం క్షీణించటంతో కుటుంబ సభ్యులు కరీంనగర్‌లోని ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. గణేశ్ భార్య సుమలత పైడిమడుగు అంగన్‌వాడీ టీచర్‌గా పని చేస్తుంది. వారికి ఇద్దరు కుమారులు ఉన్నారు.

సాయిబాబా ఆలయంలో ప్రత్యేక పూజలు



ఆలయంలో భక్తుల పూజలు

రాయికల్: మండలంలోని ఇటిక్యాల సాయిబాబా ఆలయంలో శ్రావణ శనివారం, రాఖీ పౌర్ణమి సందర్భంగా సాయినాథునికి పండితులు శివశంకరశర్మ ప్రత్యేక పూజలు నిర్వహించారు. వివిధ గ్రామాల నుంచి భక్తులు తరలివచ్చి సాయినాథున్ని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.

ఆలయంలో పౌర్ణమి వేడుకలు

జగిత్యాలరూరల్: మండలంలోని పొలాస సాయిబాబా ఆలయంలో శనివారం ఘనంగా పౌర్ణమి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా సాయిబాబాకు క్షీరాభిషేకం నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు గుండేటి గంగారాం పాల్గొన్నారు.

ఆలయాల్లో ప్రత్యేక పూజలు

సారంగాపూర్: ప్రముఖ పుణ్యక్షేత్రం దుబ్బరాజన్న ఆలయంతో పాటు, బీర్‌పూర్ శ్రీలక్ష్మీనృసింహస్వామి ఆలయంలో రాఖీ పౌర్ణమి సందర్భంగా శనివారం భక్తులు స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. గ్రామాల్లోని ఆలయాల్లోనూ భక్తుల రద్దీ కొనసాగింది.

ఎల్‌వోసీ మంజూరు

సారంగాపూర్: బీర్‌పూర్ మండల కేంద్రానికి చెందిన సైండ్ల మనుషా కిడ్నీ సంబంధిత వ్యాధి చికిత్స కోసం రూ. 2.60 లక్షల ఎల్‌వోసిని ప్రభుత్వం మంజూరు చేసింది. 18 ఏళ్ల మనుషా కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతుందని బాధిత కుటుంబం మాజీ మంత్రి జీవన్‌రెడ్డి విన్నవించారు. మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ ద్వారా నిమ్స్‌లో చికిత్స కోసం నిధులు రూ. 2.60 ఎల్‌వోసి మంజూరు చేయించారు. ఎల్‌వోసీ మంజూరుకు కృషి చేసిన మంత్రి లక్ష్మణ్‌కుమార్, మాజీ మంత్రి జీవన్‌రెడ్డిలకు మనూషా, కుటుంబ సభ్యులు, మాజీ ఎంపీపీ మసర్తి రమేశ్ కృతజ్ఞతలు తెలిపారు.

సమాచారం..

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

జగిత్యాలరూరల్: మండలంలోని పొరండ్ల సబ్‌స్టేషన్ పరిధిలో పొరండ్ల, కన్నాపూర్, బాలపల్లి, కండ్లపల్లి, హన్మాజీపేట, పొలాస సబ్‌స్టేషన్ పరిధిలో పొలాస, గుల్లపేట, అనంతారం రోడ్డాం, అగ్రికల్చర్ కాలేజ్, ఎక్స్‌ప్రెస్ ఫీడర్, హైదర్‌పల్లి గ్రామాల్లో ఆదివారం మధ్యాహ్నం 3.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఏఈ సుందర్ తెలిపారు.

మల్యాల మండలంలో..

మల్యాల: మండలంలోని పోతారం సబ్‌స్టేషన్ పరిధిలోని పోతారం, రాజారం గ్రామాల్లో ఆదివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1గంటల వరకు విద్యుత్ నిలిపివేయనున్నట్లు విద్యుత్ ఏఈ ఆకునూరి శ్రీనివాస్ తెలిపారు.

మెట్‌పల్లి పట్టణంలో..

మెట్‌పల్లి: మెట్‌పల్లి పట్టణంలోని టౌన్-1,టౌన్-2 సెక్షన్ పరిధిలో ఆదివారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏఈలు అమరేందర్,రవి తెలిపారు.

స్పాట్ అడ్మిషన్లలో అవకాశం కల్పించండి

జగిత్యాల: 'దోస్త్' స్పాట్ అడ్మిషన్లలో ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు అవకాశం ఇవ్వాలని అధ్యాపకుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సురేందర్‌రెడ్డి అన్నారు. వివిధ కారణాలతో ఇప్పటివరకు డిగ్రీలో అడ్మిషన్లు పొందని వారికి నిర్వహిస్తున్న స్పాట్ సౌకర్యాన్ని అన్ని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలకు వర్తింపజేయాలని దోస్త్ కమిటీని డిమాండ్ చేశారు. స్పాట్ అడ్మిషన్లు ఈనెల 13, 14 తేదీల్లో చేపట్టేందుకు కన్వీనర్ షెడ్యూల్ ప్రకటించారని, కేవలం ప్రైవేటు కళాశాలలకు మాత్రమే అవకాశం కల్పించారని, ఇది పూర్తిగా అర్థరహితమని అన్నారు. ఇప్పటివరకు నాన్‌లోకల్ కింద గుర్తించబడిన విద్యార్థులకు డిగ్రీలో అవకాశం ఇవ్వలేదని, ఉత్తర్వుల సంఖ్య 15 ప్రకారం నాన్‌లోకల్‌గా గుర్తించబడిన వారికి ఇస్తున్న ఏకైక అవకాశం స్పాట్ అడ్మిషన్లు మాత్రమేనని, దీనిలో చాలా మంది విద్యార్థులు చేరే అవకాశం ఉందన్నారు. ప్రైవేటు కళాశాలల్లో అధిక ఫీజులు చెల్లించేందుకు ఇబ్బంది పడతారని పేర్కొన్నారు. ప్రభుత్వ కళాశాలలో అనుభవజ్ఞులైన అధ్యాపకులు ఉంటారని తెలిపారు.



కోరుట్ల రూరల్: కోరుట్ల బస్టాండ్‌లోని స్తంభాలకు ఓ షాపింగ్ మాల్ వాళ్ల ఏర్పాటు చేసిన అడ్వర్టయిజ్‌మెంట్ బోర్డులు తక్కువ ఎత్తులో ఏర్పాటు చేశారు. దీంతో ప్రయాణికులకు ప్రమాదకరంగా మారాయి. బస్టాండ్‌లో నడుచుకుంటూ వెళ్లే ప్రయాణికుల తలలకు తగులుతున్నాయని ప్రయాణికులు వాపోతున్నారు. అదే విధంగా పారిశుధ్య కార్మికులు బస్టాండ్‌లో శుభ్రం చేసే క్రమంలో బోర్డులు తరచూ తమ తలలకు తగులుతున్నాయని, బోర్డులను ఎక్కువ ఎత్తులో అమర్చాలని పేర్కొంటున్నారు.

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి
మనోహర్, ఆర్టీసీ డిపో మేనేజర్ సెల్ నంబర్ : 9959225928

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్లు: 9705346639, 9440061630, 9705346643

ఘనంగా నూలు పౌర్ణమి వేడుకలు





ధర్మపురిలో జంద్యాల ధారణలో పద్మశాలీలు మెట్‌పల్లిలో మార్కండేయ విగ్రహం ఆవిష్కరించిన ఎమ్మెల్యే

ధర్మపురి: ధర్మపురి పట్టణంలోని గోదావరి ఒడ్డునున్న శ్రీ మార్కండేయస్వామి ఆలయంలో శనివారం జంధ్య ధారణ ఘనంగా నిర్వహించారు, స్థానిక పద్మశాలీ సేవాసంఘం అధ్యక్షుడు కొంక సుధీర్, ప్రధాన కార్యదర్శి భోగ మల్లేష్ ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా మార్కండేయ ఆలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి అనంతరం నూతన జంధ్యాల వితరణ, ధారణ కార్యక్రమాన్ని నిర్వహించారు.

మెట్‌పల్లి: మెట్‌పల్లి పట్టణంలో పద్మశాలీ సేవా సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన జంధ్యపూర్ణిమ కార్యక్రమం ఘనంగా జరిగింది. మార్కండేయుని విగ్రహాన్ని ఊరేగింపుగా పల్లకిలో ఓంకారేశ్వర ఆలయానికి తీసుకెళ్లారు. ప్రత్యేక పూజలు చేశారు.

పెగడపల్లి: మండలంలోని పెగడపల్లి, బతికపల్లి గ్రామాల్లో శనివారం నూలు పౌర్ణమి వేడుకలను పద్మశాలీలు ఘనంగా జరుపుకున్నారు. మార్కండేయ స్వామి ఆలయాల్లో సామూహిక యజ్ఞోపవీత ధారణ, అభిషేకాలు, అర్చనలు, జంజిరాలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

కథలాపూర్: మండలం గంభీర్‌పూర్, భూషణరావుపేట, కథలాపూర్ గ్రామాల్లో శనివారం రాఖీ పౌర్ణమి సందర్భంగా పద్మశాల సంఘం ఆధ్వర్యంలో మార్కండేయస్వామిని ఊరేగించారు. ఊరేగింపులో మగ్గంపై వస్త్రం తయారు చేసి స్వామివారికి సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.

యువజన కాంగ్రెస్ ఆవిర్భావ దినోత్సవం



ధర్మపురిలో కేక్ కట్ చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

ధర్మపురి/కథలాపూర్/మల్యాల: యువజన కాంగ్రెస్ ఆవిర్భావ వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. ధర్మపురి పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో, కథలాపూర్ మండల కేంద్రం, మల్యాలలోని సోనియాగాంధీ గుడి వద్ద యూత్ కాంగ్రెస్ నాయకులు కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమాల్లో ధర్మపురి అసెంబ్లీ యూత్ అధ్యక్షుడు యశోద అజయ్‌కుమార్, మండల అధ్యక్షుడు అప్పం తిరుపతి, యూత్ కాంగ్రెస్ కథలాపూర్ మండల అధ్యక్షుడు అంబటి రాధాకృష్ణ, నియోజక వర్గ ఉపాధ్యక్షుడు కాశవత్తుల వంశీ, మల్యాల మండల అధ్యక్షుడు శనిగరపు తిరుపతి పాల్గొన్నారు.

వైభవంగా వేంకటేశ్వర స్వామి కల్యాణం



కల్యాణోత్సవంలో పాల్గొన్న భక్తులు

మల్యాల: మండలంలోని లంబాడిపల్లి శ్రీ పద్మావతి సమేత ప్రసన్న వేంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం స్వామివారి కల్యాణోత్సవం వైభవంగా నిర్వహించారు. ఉత్సవ మూర్తులను ప్రత్యేకంగా అలంకరించి, కల్యాణోత్సవం ఘనంగా నిర్వహించారు. భక్తులు కల్యాణోత్సవంలో పాల్గొని, ప్రత్యేక పూజలు చేశారు. ప్రతి నెలా శ్రావణ నక్షత్రాన్ని పురస్కరించుకొని స్వామివారి కల్యాణోత్సవం నిర్వహిస్తామని, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో ఆలయ వ్యవస్థాపకులు మరాటి సత్తయ్య, అర్చకులు వికాస్ శుక్ల, విజయ్ సముద్రాల, భక్తులు పాల్గొన్నారు.